క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్



సత్తెనపల్లి: పట్టణంలోని రంగాకాలనీ సంగం డెయిరీ వెండర్ పాయింట్‌లో పశుపోషకులకు 2024–25 సంవత్సరానికి బోనస్‌ను ఆదివారం పంపిణీ చేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి, డెయిరీ మేనేజర్ తాడి బోయిన గోపి, రూట్ సూపర్‌వైజర్ శాఖమూరి నరేష్, పాల డెయిరీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు సమక్షంలో బోనస్ మొత్తం రూ.1.47 లక్షలు పంపిణీ చేశారు. సయ్యద్ ఖాసింవలికి అత్యధికంగా రూ.12,500 అందగా సీహెచ్ నాగేశ్వరరావు, షేక్ సైదా కూడా అత్యధిక బోనస్ అందుకున్నారు.

విద్యార్థులతో మోడల్ పార్లమెంట్



క్రోసూరు: గుడ్‌షెపర్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం క్రోసూరులోని ఎస్టీ కాలనీలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులతో మోడల్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలతో పార్లమెంట్‌లో మంత్రుల ప్రమాణ స్వీకార పద్ధతి నిర్వహించారు. సర్పంచ్ చందమామ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మండల ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య పాల్గొన్నారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖాశాంసన్, మండల సర్వేయర్ శ్రీధర్, గుడ్ షెపర్డ్ సంస్థ కోఆర్డినేటర్ సిస్టర్ యాంటో, సిస్టర్ స్మిత, పాల్గొన్నారు. సర్పంచ్ చందమామ బాలల పార్లమెంట్ పిల్లలకు ఐడీ కార్డులు అందజేశారు. ప్రగతి పార్లమెంటులో 14 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది సిబ్బంది లక్ష్మణ్, తల్లిదండ్రులు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ వర్కర్ రాణి పాల్గొన్నారు

దివ్యాంగుల సమగ్రాభివృద్ధికి కృషి



అమరావతి: దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు సక్షం జాతీయ సహకార్యదర్శి సురేష్ పాటిల్ చెప్పారు. సమదృష్టి క్షమతా వికాసం అనుసంధానమండలి రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో నిర్వహించారు. సురేష్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో దివ్యాంగుల అభివృద్ధి, సాధికారతకు సక్షం ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. భవిష్యత్ కార్యాచరణ నిర్ణయాలను సభ్యుల ముందుంచి ఆమోదించారు. కార్యక్రమంలో దక్షిణ భారత సంఘటన కార్యదర్శి కె.కృష్ణమోహన్, అమరావతి ఖండ కార్యవాహ గాజుల నరేంద్ర, ఖండ సంపర్క ప్రముఖ్ పులిపాటి వెంకట పవన్ కుమార్, శ్రీసరస్వతి శిశు విద్యా మందిర్ ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చిలకలూరిపేటటౌన్: తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పోషకాహారంతో క్రమం తప్పకుండా తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ శాంతకుమారి చెప్పారు. కావూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు బాలసంజీవని కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రాజేష్, ప్రత్యూష, సొసైటీ అధ్యక్షుడు కోడె హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనత నివారణకు తాజా ఆకుకూరలు, సిరి ధాన్యాలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ సెంటర్‌లలో ఆరేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువు చూపించి పోషకాహారం పొందాలన్నారు. ఆడబిడ్డలను చక్కగా చదివించుకోవాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు జరుగుతుంటే సమాచారమివ్వాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి జి.మాధవీలత, సూపర్‌వైజర్ భూలక్ష్మి, ప్రసన్న, హేమకుమార్, పోలయ్య, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నరసరావుపేట రూరల్: ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఆదివారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ జిల్లా సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎ.తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి బి.సత్యం, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆర్.గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గత విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందిన మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా స్థాయి ఉత్తమ మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు.

మాతా పాహిమాం

- దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి శరన్నవరాత్రులు
- తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయాలు ముస్తాబు
- పరిసరాల్లో ఆధ్యాత్మిక పరిమళాలు



సత్తెనపల్లిలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి



కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద దుర్గాదేవి



మహాలక్ష్మమ్మ చెట్టువద్ద మండపం

సత్తెనపల్లి: దసరా వచ్చిందయ్యా.. ఆలయాలకు పండుగ శోభ తెచ్చిందయ్యా. హిందువులు ఆరాధ్యదేవతగా ఆరాధించే శ్రీ కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలకు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ తోరణాలతో అలంకరించారు. సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం వసతులు ఏర్పాటుచేస్తున్నారు.

సోమవారం నుంచి అక్టోబర్ రెండు వరకు నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. విద్యుత్ దీపాలంకరణ, పందిళ్లు, క్లాత్ డెకరేషన్ వంటి ఏర్పాట్లు చేశారు.

రోజుకో అలంకరణ...

దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. సత్తెనపల్లిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22న శ్రీబాలాత్రిపురసుందరీదేవి, 23న శ్రీగాయత్రీదేవి, 24న శ్రీఅన్నపూర్ణాదేవి, 25న శ్రీకాత్యాయనీదేవి, 26న శ్రీమహాలక్ష్మీదేవి, 27న శ్రీలలిత త్రిపురసుందరీదేవి, 28న శ్రీమహాచండీదేవి, 29న శ్రీసరస్వతిదేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిదేవి, అక్టోబర్ 2న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ప్రతి రోజూ రాత్రి 9 గంటలకు మహిళా మండలి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించనున్నారు.

మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద..

పట్టణంలోని కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద గణేష్ యువసేన ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా మండపాన్ని సిద్ధం చేశారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు, రాత్రి 8 గంటలకు పూజలు నిర్వహిస్తారు. రోజుకో అలంకారంలో అమ్మవారికి విశేష పూజలు చేయనున్నారు.

త్రిశక్తి దుర్గాపీఠంలో..

పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గా పీఠంలో అమ్మవారు దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో భక్తులకు కనువిందు చేయనున్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: ఆర్యవైశ్య సంఘం, వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీల ఆధ్వర్యాన సోమవారం నుంచి శ్రీ సీతారామస్వామిదేవాలయంలో, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవార్లను రోజుకొక అలంకారంతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలకు అన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సూరే సుబ్బారావు తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని ప్రతి దేవాలయం ముందు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మహిళలతో బతుకమ్మను ఏర్పాటు చేసి, ఆటపాటలతో అమ్మవారి పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆర్యవైశ్య మహిళా విభాగం వారు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



డిజిటల్ లావాదేవీలపై జరిగిన అవగాహన ర్యాలీలో డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ కోటిరత్నం తదితరులు

నకరికల్లు: మహిళలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యాన మండలంలోని చాగల్లు ఎస్సీ కాలనీలో డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యతపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో డిజిటల్ చైతన్యం పెంపొందించి ఆర్థిక స్వావలంబనకు ముందడుగు వేయాలని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ బ్యాంకు సిబ్బంది శైలజ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యం, యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సదుపాయాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వినియోగం, ఆర్థిక పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌ఆన్ మోసాలను గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు, యువత పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించడానికి కరాటే పోటీలు



సత్తెనపల్లి: ఒత్తిడిని జయించేందుకు కరాటే పోటీలు దోహదపడతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆర్చి డ్రాగన్ షూటో కాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది బాలబాలికలు హాజరయ్యారు. శోభారాణి మాట్లాడుతూ కరాటే పోటీలతో విద్యార్థులు మానసికంగా, ఆరోగ్యంగా ఎలాంటి ఒత్తిడినైనా జయిస్తారన్నారు. ఇలాంటి పోటీలను సత్తెనపల్లిలో నిర్వహించడం, తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం బెల్ట్‌టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్చి డ్రాగన్ కరాటే ఫౌండర్ పి.రాంబాబు, జూడో సీనియర్ కోచ్ జి.సాయిరాం, ఆర్చి డ్రాగన్ కరాటే గుంటూరు ప్రెసిడెంట్ జి రవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు వైద్యపరీక్షలు

వినుకొండ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏనుగుపాలెం పీహెచ్‌సీ సెంటర్‌లో క్లాప్ మిత్రలకు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగేశ్వరరావు నాయక్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ సుందర్‌రెడ్డి, సర్పంచ్ మాదినేని వెంకటలక్ష్మి, మండల స్వచ్ఛభారత్ మిషన్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న పెండ్యాల మహేష్

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రకారం పాత కౌలు చట్టాన్ని రద్దు చేసి కొత్త కౌలు చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లోనే తీసుకురావాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెండ్యాల మహేష్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న చలో అసెంబ్లీ జరుగుతుందని దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించినట్లు భూ యజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇంతవరకు విధివిధానాలు ప్రకటించలేదన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 300 మంది కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. అయినా ఈ ప్రభుత్వానికి మనసు కరగ లేదని, సాయం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని 80 మంది ఎమ్మెల్యేలకు, అనేకమంది మంత్రులకు రెండు లక్షల సంతకాలతో ముఖ్యమంత్రికి వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

కౌలు చట్టం చేయడానికి సమయం దొరకలేదా

కౌలు చట్టం చేయడానికి ఈ ప్రభుత్వానికి సమయమే దొరకలేదని ఎద్దేవా చేశారు. కాబట్టి ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీ లో పెట్టి ఆమోదించి చట్టానికి తుది రూపం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీ విజయవాడ నుంచి జరిగే చలో అసెంబ్లీని జయప్రదం చేయాలని, కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులను, వ్యవసాయ కూలీలను ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం కోరుతోందన్నారు.

చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

ముప్పాళ్ళ: కౌలు రైతుల సమస్యలపై ఏపీ కౌలు రైతు సంఘం ఈ నెల 22న చేపట్టిన చలో అసెంబ్లీలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తొరటి అమరలింగేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కౌలు చట్టంలో మార్పులు తీసుకువస్తామని హామీ ఇచ్చిందని, దాన్ని అసెంబ్లీ సమావేశంలో తీసుకురావాలని కోరారు. ప్రధానంగా భూయజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు కూడా అందేలా చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం 80 మంది ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందించినా ఫలితం లేదని, తప్పని సరి పరిస్థితుల్లో కౌలు రైతుల విషయాలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరుతూ విజయవాడ నుంచి చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, చింతపల్లి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సారూ.. వంతెన నిర్మించండి



ఎద్దువాగుపై కుంగిపోయిన చప్టా



వాగు ప్రవాహం ఇలా

- ఎద్దువాగు వద్ద కుంగిన చప్టా
- చిన్నపాటి వర్షానికి చప్టాపై నుంచి ప్రవాహం

రాజుపాలెం: ఎద్దువాగుపై నిర్మించిన చప్టా ప్రమాదకరంగా మారింది. ఇక్కడ వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల అతి భారీ వాహనాలు, గ్రావెల్ టిప్పర్లు చప్టాపై తిరగడంతో కుంగిపోయింది. మండలంలోని ఉప్పలపాడుకు అతి సమీపంలో వంద మీటర్ల దూరంలో ఎద్దువాగు ప్రవహిస్తుంది. గతంలో ఎద్దువాగుపై రాకపోకలు సాగించడానికి చప్టాను ఏర్పాటు చేశారు. దానికి అటువైపు ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని చల్లాపల్లితండా, లక్ష్మీపురంతండాలు ఉన్నాయి. గిరిజనులకు ఏ అవసరమైనా ఉప్పలపాడు కాలినడకన రావాల్సిందే. చిన్నపాటి వర్షం వచ్చిందంటే చప్టాపై నుంచి వాగు ప్రవహిస్తుంది. ఆ సమయంలో మహిళలు, వృద్ధులు, పిల్లలు, రైతులు అటుగా వెళ్లడానికి భయపడుతున్నారు. ఒక్కోసారి రెండు, మూడు రోజులు రాకపోకలు కూడా నిలిచిపోతాయి. తండాలకు సమీపంలో గ్రావెల్ క్వారీలు ఉండటంతో అనధికారికంగా రాత్రివేళల్లో అతివేగంతో భారీ టిప్పర్లు తిరగడంతో చప్టా దెబ్బతింది. గ్రామం మధ్యలో నుంచి భారీ వాహనాలు తిరగడంతో సీసీరోడ్లు దెబ్బతినడమే గాక పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు చప్టాపై నుంచి భారీ స్థాయిలో వాగు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాగును తలపిస్తున్న సీసీ రోడ్డు

చప్టాపై నుంచి భారీ వాహనాలు తిరగడంతో గ్రామంలోని బ్రహ్మంగారి గుడివద్ద సీసీ రోడ్డు పగిలిపోయి గుంత ఏర్పడింది. దానిలో ఎప్పుడూ అడుగు లోతు నీళ్లు నిల్వ ఉంటాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుంగిపోయిన చప్టా స్థానంలో వాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, తండావాసులు కోరుతున్నారు.

• సత్తెనపల్లి జలమయం



22వ వార్డు నాగన్నకుంటలో ఇళ్ల ప్రాంగణంలోకి చేరిన నీరు




సత్తెనపల్లి 19వ వార్డులో తటాకంలా మారిన రహదారి


భారీ వర్షానికి సత్తెనపల్లి నీట మునిగింది. ఆదివారం సాయంత్రం కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్లపై నీళ్లు నిలిచాయి. పట్టణంలోని నాగన్నకుంట ఏరియా, సుందరయ్య కాలనీ, మాస్టిన్‌పేట, దోబీఘాట్, తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి.

–సత్తెనపల్లి

'స్మార్ట్' గా తప్పులు



స్మార్ట్ కార్డులో ఇంటిపేరులో తప్పులు



స్మార్ట్ కార్డులో పల్నాడు జిల్లాకు బదులు గుంటూరు జిల్లాగా నమోదైన దృశ్యం

ముప్పాళ్ళ : స్మార్ట్‌రేషన్ కార్డులు తప్పుల తడకగా మారాయి. కార్డులోని కుటుంబ సభ్యులు, యజమాని పేరు నమోదులో అక్షరదోషాలతో పాటుగా ఇంటి నంబర్లూ తప్పులే నమోదయ్యాయి. ఇదిలా ఉంటే కొత్తగా పల్నాడు జిల్లా ఏర్పడి మూడేళ్లు దాటినా కార్డుల్లో గుంటూరు జిల్లాగానే నమోదైంది. తప్పులను గమనించి కార్డుదారులు ప్రశ్నించగా సంబంధిత సిబ్బంది.. తప్పులు సవరించి మళ్లీ కొత్త కార్డులు ఇస్తామని దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సత్తెనపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు



నందిగామలో నిరుపయోగ వస్తువులను స్వచ్ఛరథంలో కాటా వేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు అన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పెంపునకు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను, పునర్వినియోగానికి ఉపయోగపడే వస్తువులను కొనుగోలు చేయడానికి సత్తెనపల్లి మండలానికి స్వచ్ఛరథం ఎంపిక కావడంతో ఆదివారం సత్తెనపల్లి మండలం నందిగామలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛరథం మండలంలోని ప్రతి గ్రామపంచాయతీకి తిరిగి వస్తువులను కొనుగోలు చేసి ఆ ధరకు సమానమైన నిత్యవసర వస్తువులను తిరిగి ఇస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికుల సహకారంతో స్వచ్ఛరథం విజయవంతం చేసి గ్రామాలు పారిశుద్ధ్య బాటలో ఉండేలా చూడాలన్నారు. స్వచ్ఛరథం ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాల్లో షెడ్యూల్ ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, ఇన్‌చార్జ్ డెప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్‌రెహమాన్, పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలుకూరి కృష్ణప్రసాద్, చల్లంచర్ల శ్రీనివాస్, ఐటీసీ అసిస్టెంట్ ట్రైనర్ చెంబేటి బొలయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



చేజర్లలో 9వరోజు రిలే దీక్షలో బాధితుడు సాగర్ బాబు, భార్య కెజియా, తల్లి వీరమ్మ తదితరులు

నకరికల్లు: న్యాయం కోసం తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంగానీ అధికారులుగానీ పట్టించుకోవడం లేదని పీడీఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు మండిపడ్డారు. కారంపూడిలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో షాక్‌కు గురై మంచానపడినా అధికారుల నుంచి సహాయసహకారాలు అందడం లేదంటూ న్యాయం కోసం మండలంలోని చేజర్లలో కుటుంబసభ్యులతో కలసి చేస్తున్న నిరాహార దీక్ష ఆదివారానికి 9వరోజుకు చేరుకుంది. బాధితుడు సాగర్‌బాబు, భార్య కెజియా, తల్లి వీరమ్మకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాగర్‌బాబును విద్యుత్ మరమ్మతులకు పిలిచి వాటి నిర్వహణ క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. పెదకొదమగుండ్ల లైన్‌మెన్ ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మాచారిలపై చర్యలు తీసుకొని బాధితుడిని ఆదుకుని అతని కుటుంబానికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం మాచర్లలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పరిస్థితిని వివరించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పిత్యకార్యాలు



అమరేశ్వర ఘాట్‌లో జరుగుతున్న పిత్యకార్యాలు



పిండాలను కలుపుతున్న దృశ్యం

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని పెద్దఎత్తున తరలి వచ్చిన ప్రజలు పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో పిత్యకార్యాలు నిర్వహించారు. దీంతో అమరేశ్వర ఘాట్ కిక్కిరిసిపోయింది. భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య వరకు మహాలయ పక్షాల్లో చివరి రోజైన మహాలయ అమావాస్య నాడు వేలాది మంది భక్తులు తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండ ప్రదానం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండాలను కృష్ణానదిలో నిమజ్జనం చేసశారు. అమరేశ్వరాలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మహాలయ అమావాస్యను వివరిస్తూ మహాలయ పక్షాల్లో పితృతర్పణాలు, శ్రాద్ధవిధులు నిర్వర్తిస్తే పితృదేవతలంతా సంవత్సరమంతా తృప్తి చెందు తారని పురాణాలు చెబుతున్నాయన్నారు.

యోగాసనం చాంప్‌లో సత్తెనపల్లివాసుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న యోగా పోటీల్లో విజేతలు

సత్తెనపల్లి: యోగాసనం చాంప్ 2025–26లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ఆరుగురు ప్రతిభ చాటారు. గుంటూరు జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్జీవో కాలనీలో మున్నంగి హైస్కూల్లో ఆదివారం యోగాసన చాంపియన్‌షిప్ నిర్వహించారు. సత్తెనపల్లి యోగా గురువు రమేష్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి వాసులు పోటీ పడారు. 60 ఏళ్లు పైబడిన విభాగంలో ప్రథమస్థానం సత్తెనపల్లికి చెందిన పులికొండ శ్రీనివాసరావు, తృతీయస్థానం మాదంశెట్టి వేదాద్రి, 50–60 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం ధనేకుల సాంబశివరావు, ద్వితీయస్థానం పులహరి భానోజీ, 40 నుంచి 50 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం ఎం.సునీల్‌కుమార్, తృతీయస్థానాన్ని తల్లం ఆంజనేయులు కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి అక్టోబర్ 25, 26 తేదీల్లో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. విజేతలను యోగా సాధకులు అభినందించారు.